తెలుగుకళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన కథ

# శాంతి వేసిన సూటి ప్రశ్న

## వవేరావ్



మావూర్లోనే మా చిన్నాన్న కూతురు లత పెండ్లికి వచ్చిన బంధు మిత్రులంతా ఒక్కొక్కరే వెళ్ళిపోవటంతో మాకంతా కొంత తీరిక చిక్కింది. ఎక్కడో భోపాల్‌లో వున్న తమ్ముడు రమేష్ ఈ పెండ్లికి కుటుంబంతో రావటంతో మా ఇల్లు పిల్లలతో సందడిగా తయారయింది. దసరా సెలవులు కూడ కలిసి రావడంతో పిల్లల అల్లరికి హద్దు లేకుండా వుంది. మా నాని కి క్షణం కూడా తీరిక లేదు. మా రమేష్ పిల్లలు అయిదేళ్ళ శాంతి, పదేళ్ళ విజయ్‌లు ఊహ తెల్సిన తర్వాత మా పల్లెకు రావటం ఇదే మొదటిసారి కావటం వల్ల వాళ్ళకు ఇక్కడి పద్ధతులన్నీ విచిత్రంగా వున్నాయి. మా నానిగాడు వాళ్ళకు పెద్ద హీరో అయిపోయాడు. చిన్న పిల్లలు కేరింతలు కొడుతూ ఈత కొద్తుంటే విజయ్‌కి చెప్పలేనంత ఆశ్చర్యం.

దసరా పండుగలు రానే వచ్చాయ్. "దసరా పండుగలు మునుపటి లాగా ఎవ్వరూ జరుపుకోవటం లేదురా అబ్బాయ్!" మా బామ్మ తన గత స్మృతులు నెమరు వేసుకోసాగింది. నిజంగానే నవరాత్రులూ వేడుకలు జరుపుకోవటం దసరా పండుగల ప్రత్యేకత. అలాంటిది ఒక్క విజయదశమి రోజు మాత్రమే పండుగ వాతావరణం కనపడుతోంది. పెరుగుతున్న ధరల్కు తరుగుతున్న ఆస్తులు, ప్రకృతి చిన్నచూపు గ్రామీణ జీవితంలోని వెలుగును హరించాయి. యాంత్రికంగా పండుగలు జరుపుకోవడం, ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలు "అమ్మయ్య!" అని ఊపిరి పీల్చుకోవటం సర్వ సాధారణమైంది.

"ఆ రోజుల్లో ఈ పండుగలకు బొమ్మల కొలువు ఎంత బాగా తీర్చేవారో! మీ తాతగారు చైనా పింగాణి బొమ్మలు, ముచ్చటైన రకరకాల మట్టి బొమ్మలు తెచ్చేవారు. ఊరు ఊరంతా బొమ్మల కొలువు చూట్టానికి తరలి వచ్చేది. బామ్మ చెప్పటం ఆపేసరికి మా నానిగాడు "మరి తాతగారు తెచ్చిన బొమ్మలన్నీ ఎచ్చట దాచేసారు మామ్మా!" అని ఆసక్తితో అడిగాడు. వింటున్న పిల్లల కళ్ళల్లో రంగురంగుల బొమ్మల కొలువు కదలాడినట్టే వుంది.

"తాతగారు తెచ్చిన బొమ్మలన్నీ ఆ మూలగదిలో పెద్ద చెక్క పెట్టెలో వున్నాయ్రా!" బామ్మ అనటంతో పిల్లలంతా బిల బిలమంటూ మూలగదిలోకి పరుగు తీశారు. అంత వరకూ గుర్తింపు లేక అచేతనంగా పడి వున్న ఆ పెద్ద చెక్క పెట్టే వాళ్ళకి ఎంతో అపురూపమైంది. అక్కడక్కడా వున్న పగుళ్ళలోంచి లోనికి చూసిన పిల్లలకి అందులో ఏమీ కనపడకపోవటంతో నిరాశే మిగిలింది. "ఏనుగు బొమ్మలున్నయ్యా మామ్మా!" మా రమేష్ కూతురు శాంతి ప్రశ్న. "ఉన్నాయమ్మా. అన్ని రకాల బొమ్మలు ఉన్నాయ్"

బామ్మ ప్రేమతో శాంతిని దగ్గరికి తీసుకొంది. మా ఇంట్లో లేక లేక పుట్టిన ఆడపిల్ల కావటంతో శాంతిని రమేష్‌తోపాటు భోపాల్‌లో వుంచటం మా బామ్మకిష్టం లేదు. ఆమె వద్దనే వుంచుకొని పాప అచ్చటా ముచ్చటా చూసుకోవాలని ఆమె తాపత్రయం. పిల్లలంతా బొమ్మల కొలువు పెట్టాలని పట్టుబట్టటంతో మరలా బొమ్మలన్నీ బయటకు తీయాల్సి వచ్చింది. ఒక్కొక్క బొమ్మను పిల్లలు సంభ్రమంగా చూడసాగారు.

మా బామ్మ పిల్లల్లో పిల్లలాగా చకచకా తిరుగుతూ కొలువు ఏర్పరుస్తూ వుంటే మాకే ఆశ్చర్యంగా వుంది.




బొమ్మల కొలువు చక్కగా తీరింది. చిన్న బొమ్మరిళ్ళు, వైపు వీధి బావి, మధ్యలో దేవళం, చిన్న పల్లెనే తయారు చేశారు బొమ్మల కొలువుకి. అచ్చటచ్చట చ్చని చెట్లూ, ఆవుదూడ బొమ్మలూ ముచ్చటగా వున్నాయ్.

మా రమేష్ కొడుకు విజయ్ చిన్న చిన్న అట్ట ముక్కలు కత్తిరించి మేడలు, వీధి దీపాలు, లతో చిన్న పట్టణం సృష్టించాడు. మా పిల్లల కంతా ఈ చిన్ని పట్టణం పెద్ద ఆకర్షణగా తయార యింది. మరీ పట్టణంలో మూలగా వున్న చిన్న ఫ్యాక్టరీ, తగరంతో చేసిన చిమ్నీలతో కన్నుల పండుగ్గా వుంది. మా శాంతికి మాత్రం పట్టణం కొలువు కంటే పల్లెలోని బొమ్మరిళ్ళే బాగా నచ్చాయ్. "వాని అన్నయ్య కట్టిన దేవళం బొమ్మరిళ్ళు, ఆవుదూడల బొమ్మలూ ఎంచక్కా వున్నాయ్" అంటున్న శాంతిని ఉడుక్కుంటూ చూశాడు విజయ్.

"లేదమ్మా! విజయ్ అన్నయ్య్య ఫ్యాక్టరీ భేషుగ్గా వుంది" అన్న నా మాటలకు విజయ్ కళ్ళలో మెరుపు. గర్వంగా తలాడించి బయటికి వెళ్ళాడు విజయ్.

సాయంత్రం పేరంటానికి పిలుపు వెళ్ళింది. మా ఊరిలో పిల్లలందరికీ ఈ బొమ్మల కొలువు పెద్ద ఆకర్షణ. బిలబిలమంటూ పిల్లలంతా రావటం పోవటం. ఇంతలో ఇంట్లోంచి కేకలు. మా విజయ్ వెక్కి వెక్కి ఏడుపు. లోనికి వెళ్ళిన నాకు శాంతిని పెట్టుకొని బాదేస్తున్న వాళ్ళమ్మ కనపడింది. బొమ్మల కొలువులోని విజయ్ కట్టిన ఫ్యాక్టరీ పడిపోయి వుంది. అట్టముక్కలన్నీ చిందర వందరగా పడివున్నాయ్. శాంతి బుగ్గలు ఎర్రగా కందాయి. శాంతి ఫ్యాక్టరీ పాడుచేసిందని పిల్లల గొడవ.

శాంతిని దగ్గరకు తీసుకొని బుజ్జగించి మెల్లగా అడిగాను. "ఎందుకమ్మా శాంతీ! అన్నయ్య ఫ్యాక్టరీ పాడుచేశావు. తప్పకదూ!"

"నేను కావాలని చేయలేదు పెదనాన్నా!" వెక్కిళ్ళతో చెప్పింది శాంతి. అన్నయ్య కట్టిన ఫ్యాక్టరీ లోంచి గ్యాస్ బయటికి వస్తే పక్కనే వున్న ఆవుదూడ బొమ్మలూ, బొమ్మరిళ్ళలోని మనుషులూ, ఇంకా రాజా రాణీ బొమ్మలూ చచ్చిపోవూ? మా భోపాల్ లో ఇలాగే ఎంతో మంది చచ్చిపోయారుగా!" అంటూ అయిదేళ్ళ మా శాంతి చెప్పిన జవాబు విని అవాక్కవటం మా అందరి వంతయ్యింది.శాంతి ఇచ్చిన జవాబు మాకు సూటి ప్రశ్నగా మిగిలింది. ●

